ఈ వారం కథ

రాళ్ళవాన

— రాప్తాడు గోపాలకృష్ణ

చిటపట చిమకులు.

కమ్మటి మట్టివాసన.

గుండెనిండా పీల్చాడు సూర్యం.

ఏదో మత్తు. కళ్ళు రెప్పలు కప్పకున్నాయ్.

అంతర్నేత్రం ముందు పాతదృశ్యం–

మోకాలి లోతు వాననీళ్ళు. కాగితపు పడవల పోటీలు. పిల్లల కేరింతలు.

గాల్లో ఎగిరొచ్చింది వొక హస్తం. సూర్యం నీవు చుర్రుమంది. తూలి నీళ్ళల్లో పడ్డాడు.

"వెధవా ఛీ...గబ్బునీళ్ళల్లో ఆడుకుంటావా? ఆడుకోవడానికి అలగాజవాలే దొరికారా! ఇంటికి పద...."

"అమ్మా ఆడుకుంటావే పడవలాట"...

చేయి మళ్ళీ గాల్లోకి లేచింది. గాజుల గల గల శబ్దం. తప్పించుకొని పారిపోదామనుకున్నాడు. ఎదురుగా అమ్మ కాళికావతారం భయపెట్టింది.

గదిలో కిటికీ దగ్గర కూర్చున్నాడు. తన పడవ కూలిపోయి కంపల్లో చిక్కుకుంది.

"ఓ...లుక్ ఎట్ ది మూన్" అక్క బట్టీ పెడుతోంది.

గణగణ గంట మోగింది. ఈ లోకంలోకి వచ్చాడు సూర్యం. "ఏయ్ టేక్ యువర్ బుక్స్. గెట్ ఇన్‌టు ది క్లాసెస్. హరియప్..." టకటకలాడింది బెత్తం.

"సర్...సర్...ప్లీజ్, ఒన్ మినిట్ సర్, బ్యూటిఫుల్ రెయిన్ సర్..."

"షటప్. ఫస్ట్ యు లీవ్ ది వరండా..."

చలిగాలి కిటికీలోంచి లోనికి గెంతింది. ముఖానికి వొలిపిరి కొట్టింది. హాయిగా అనిపించింది సూర్యానికి.

ఇవ్వాళ వానలో తడిస్తే! అబ్బ ఎన్ని ఏండ్లుగా తనలో నిక్షిప్తమైన కోరిక!!

కోరికకు రెక్కలు మొలిచాయి.

మైదానంలోకి వచ్చాడు.

వానసీళ్ళు చల్లానికి చేరుతున్నాయ్.

బుడగలు పుడుతూనే చస్తున్నాయ్.

చిలుక్...చిలుక్... జలసంగీతం.

వొక కట్టెపుల్లను తీసుకున్నాడు. నీళ్ళల్లో కొట్టాడు. ఓహ్ ఎన్ని శబ్దాలో! జలవాయిద్యాన్ని ఎవరైనా భలే వాయించొచ్చు.

"ఏంటోయ్ సూర్యం చిన్న పిల్లాడిలా ఆడుకుంటున్నావ్. నీ క్లాస్‌రూంలో పిల్లలంతా అల్లరి చేస్తుంటే" హెడ్మాష్టర్ కోప్పడ్డాడు.

"మీరు కూడా రండి ఆడుకుందాం. ఎప్పుడూ పిల్లల పీపులు వాయించడమేనా. కాసేపు జలవాయిద్యం వాయిద్దాం. చూడు ఎంత ఆహ్లాదమైన శబ్దాలో" కట్టెపుల్ల ఆకాశంలోకి విసిరేసి, ఆటూ ఇటూ గెంతాడు. చికులుకుమ్.... చికులుకుమ్.... చిక్....చిక్....చిక్....

"హ....హా...హ్హా" పిల్లలు హాయిగా నవ్వారు.

ఆ నవ్వుల్లో కూడా సంగీతం. మనిషి కూడా వొక వాయిద్యపరికరమే. కాకపోతే తనను తాను శ్రుతి పెట్టుకోవటం మర్చిపోయుంటాడు.

"ఏయ్ డోంట్‌లాఫ్. టేక్ యువర్ బుక్స్..." గాండ్రించాడు హెడ్మాష్టర్.

"ఏమోయ్ హెడ్‌మాష్టర్...గ్రీ ఎందుకట్లా మొత్తుకుంటున్నావ్. పిల్లలూ రండి ఆడుకుందాం – వానా వానా మల్లప్ప... మళ్ళీ మళ్ళీ రావప్పా...."

పిల్లలు తూనీగలు. ఎగిరొచ్చారు మైదానంలోకి.

జగ్..జగ్...జజ్జనక...జగ్

రెయిన్ రెయిన్ కమ్ అగైన్

హయ్....హయ్.....

అనేక బాలల హృదయ రాగాల సమ్మేళనం. అదో సామూహిక గీతాలాపన.

వేటగాళ్ళు...యూనివర్సిటీ పట్టాలు పొందిన వేటగాళ్ళు – విరుచుకుపడ్డారు. బెత్తాలు, గర్జనలూ, గాండ్రింపులూ – అదో జలియన్‌వాలాబాగ్.

"మీ పిల్లలకు ప్రతిక్షణం సొంత యింటి అనుభూతి. శాస్త్రీయ పద్ధతుల్లో విద్యాబోధన మా ప్రత్యేకత. ప్రేమానురాగాలకు ప్రతిరూపం మా ప్రగతి రెసిడెన్షియల్ స్కూల్....

"ఏయ్ సూర్యం నీకేమైనా బుద్ధుందా? నువ్వేం చేస్తున్నావో తెలిసే చేస్తున్నావా?"

"డైరెక్టర్ గారికి ఫోన్ చేయండి తొందరగా. వీడికి యీ మధ్య పిచ్చెక్కినట్టుంది. ఏదేదో వాగుతున్నాడు".

"ఫోన్ కాకపోతే మరేదయినా చేసుకోపోరా వుంగమార్. నాన ఏమైనా డైరెక్టర్ గాడి తాతసొత్తా?"

హేయ్..ఛల్ ఛల్ గుర్రం ...చలాకి గుర్రం.

* * *

వేడే విడుదల.

సూర్యనారాయణ ఎం.ఏ.ఎం.ఫిల్.,

ఎవడ్నివాడు విడుదల చేసుకోవాలి.

సూర్యం నీళ్ళోడుతూ పడుస్తున్నాడు. తడిచి తడిచి ముద్దడవుతున్నాడు. ఆకాశం కుళ్ళి కుళ్ళి యేడుస్తుంది. అమ్మకూడా యిలానే వర్షించేది – నాన్న తిట్టినపుడు. వంటిల్లు అమ్మ యజ్ఞశాల. హోమం చేసి చేసి తెల్లటి పొగల మంచి రుచికరమైన వంటలు సృష్టించేది.

నాన్న గామగెద్దు. ఎప్పుడూ ఆఫీసే. నీతిపరుడంటారు అందరూ. అమ్మ మాత్రం అసమర్థుడని గొణుగుతుంటుంది.

తనకు ఆశలేదని చెబుతుంటాడు నాన్న. లాటరీ టికెట్లు మాత్రం రెగ్యులర్‌గా కొంటాడు. మడత పెట్టకుండా అపురూపంగా తెచ్చి, భగవద్గీతలో దాచి పెడుతుంటాడు. పూజ చేసినపుడు దానిచుట్టూ వూదిబత్తి తిప్పతాడు.

అక్కయ్య నవలలు చదివేసి రహస్యంగా. ఎప్పుడూ అద్దం ముందే. తెల్లగా అందంగా వుండేది. తక్కువ కట్నం కదాని వయసు మల్లిన వాడితో పెళ్ళి. పెళ్ళిరోజు అమ్మలక్కలు వొకటే గుసగుస – ఈడూ జోడూ కుదరలేదని. బియ్యమూ మవ్వులూ కలిసినట్టుండాయని. పెళ్ళికొడుకు పల్లగా వున్నాడు. సంవత్సరం కూడా కాపురం చేయకుండా వురేసుకు చచ్చిపోయింది. పిచ్చితల్లి ఎవరితోనో లేచిపోకూడదూ. ఫ్రీ... ఇంతలావు కమగుడ్లు బయటికి వుబ్బి, పొడవాటి నాలుక చాచి, మూత్రం పోసుకొని ఎంత భయంకరంగా చచ్చిందో.. ఎంత బాధపడి చచ్చిందో...

దుఃఖం నాభి మండి తన్నుకొచ్చింది. బోరున యేడ్చేశాడు. ముప్పయ్ వడిలో పడుతున్న సూర్యం వడిరోడ్డులో వడుస్తూ పడుస్తూ యేడుస్తున్నాడు. యేడ్చుకుంటూ యేడ్చుకుంటూ పడుస్తున్నాడు.

ఎవరు వోదార్చుతారు?

ఎవరు ఎవర్నీ వోదార్చలేరు. ఎవడ్ని వాడే వోదార్చుకోవాలి.

"రేయ్ కుక్క. మెల్లగా పడుమ్. దానివేపు ఆసలే చూడకు. ఈదారిలో మరెవ్వరూ రాకూడదు. ఇటు వేపు రా. ఎలా వుందో చూడు సింహం మాదిరి." పక్కిపక్కి పడుచుకుంటూ యిద్దరు మనుషులు

అంత బాధలోనూ నవ్వొచ్చింది సూర్యానికి. మనస్ఫూర్తిగా బిగ్గరగా నవ్వాడు. ఎన్నాళ్ళయిందో అంత స్వచ్ఛంగా నవ్వి పక్కగా పడుస్తున్నవాడు జడుచుకొని దూరంగా జరిగాడు.

భయం భయం

పెళ్ళానికి మొగుడంటే భయం.

పిల్లలకి టీచర్లంటే భయం.

వుద్యోగులకి ఆఫీసర్లంటే భయం.

నిరుద్యోగులకి భవిష్యత్ భయం.

ఎంత మొనగాడైతే నేం కుక్కకి భయపడాల్సిందే.

ఏయ్ మైడియర్ డాగ్. కింగ్ ఆఫ్ ది స్ట్రీట్. ఫియర్ ఆఫ్ ది మాన్. కీప్ ఇట్ అప్. షేక్ యువర్ లెగ్ లెట్ మి కిస్ యు. కరువ్ బాగా కరువ్. కరిచేవాడిదే లోకం. ఎన్నటికీ భయపడొద్దు. ఎవరికీ భయపడొద్దు. వొక్కసారి భయపడ్డావా అంతే నిన్ను చావతంతారు. వడ్డి విరగ్గొడ్తారు. వస్తావ్ డాగ్... సీ,యు.

రయ్...య్ దూసుకుపోయింది లారీ. బురద నీళ్ళ కెరటం ఎగిరి పడింది. సూర్యం వెత్తిమండి కాళ్ళదాకా బురద. 'భలె. ..భలే' ఎగిరి గెంతేడు.

సార్ సార్ సూర్యం సార్. వర్షంలో తడుస్తూ, యీ బురద. ఏందిదంతా? ఏమైంది మీకు? మనసు మంచిగుంటలేదా? ఏయ్ ఎవరు నువ్వు? సూర్య...మా! వాడెవడు? వూ చెప్పు ఎవడువాడు.

"మీ...మీరే సార్"

నేనా! సూర్యం...సూర్యం...ఆ యస్ అయామ్ సూర్యం ఎం.ఎ.ఎం.ఫిల్., గుర్తొచ్చింది. గుర్తొచ్చింది. థాంక్యూ

"అయితే నీవెవరు?"

"నేను సార్ టైలర్ యాదగిరిని"

ఏమీ తోచక మౌనంగా నిలబడ్డాడు సూర్యం.

"రండి సార్ చాయ్ తాగుదాం" జాలిగా పిలిచాడు. చేతిలోకి చేయి తీసుకుంటూ భయంగా, ఆప్యాయంగా.

సూర్యం అతన్ని అనుసరించాడు.

పూలీ వచ్చింది. పొగలు కక్కుతోంది.

"యీ పూరీ చూడూ ఎంత నిండుగా వున్నట్టుందో మన జీవితం లాగ. అంతా డొల్ల. తుస్...తుస్ గాలి...హ... హ...హ.." రెండు చేతుల్తో చించుకుంటూ ఆత్రంగా తినేశాడు. ఎవరో తరుముతున్నట్టు వేడి టీ. గుటగుట తాగబోయాడు. నాలిక కాలింది.

బిల్లు చెల్లించి బయటికి వచ్చాడు. యాదగిరి. సూర్యం అప్పటికే చేయిదాటి పోయాడు.

* * *

వర్షం వెలిసింది. ఎండ.

గుండీలు వూడిపోయి ఛాతీ కన్పిస్తోంది. జుట్టు చిందర వందరగ ఎగుర్తోంది. గాలి నిండిన ప్లాస్టిక్ కవర్ దొర్లుకుంటూ వచ్చి సూర్యం కాలిని చుట్టేసింది. తనను అడ్డుకున్నందుకు కోపం వచ్చింది. తీక్షణంగా చూసి చేతిలోకి తీసుకున్నాడు. నెత్తికి తగిలించాడు. నీడను చూసుకున్నాడు. కిరీటంలా స్వప్నస్కలనాలు.

అలా శరీరాన్ని పారేసి పడుకొందామె.

పోలీసుల భయం. సుఖరోగాల భయం. సంఘానికి భయం. హెచ్.ఐ.వి. గడ్డకట్టుకు పోయాడు. చెమటలు పోశాయి. గుండె దడదడ కొట్టుకుంది. గబగబ బయటికి నడిచాడు. తన వుండై...మరొకరికి పండై ఏదో కవితా చరణం మనసుని మలిపెట్టేసింది.

శరీరాల్ని అద్దెకు తీసుకోగలం.

స్వర్గాల్ని, అనుభూతుల్ని కొనగలమా?

వొక్కోసారి – ఎవర్నయినా బలవంతంగా ..ఛీ...ఛీ.....

సభ్యత, సంస్కారం.

మరొకసారి – విరక్తిగా – అంగాన్ని కోసేసుకుంటే.

ఎవరినైనా ప్రేమించాలనుకున్నాడు. తన కెవరూ తారసపల్లేదు. చదువుకునే రోజుల్లో విశాఖపట్టణం సముద్రపుటొడ్డున కూర్చొని ఎన్నికలలు – అన్నీ కెరటాల్లా విరిగి పడ్డాయి.

తన భార్యని ఎప్పుడూ తిట్టకూడదు. అసలు భర్తగా వుండకూడదు. స్నేహితుడిగా మెలగాలి. వొకర్నొకరు అర్థం చేసుకుంటే, ఎంత ఆనందంగా వుండొచ్చు.

పెద్ద ఆశలు వుండకూడదు. వొక చిన్న యిల్లు. ప్రతిదీ చక్కగా అమర్చుకోవాలి. అన్నీ నేచురల్‌గా వుండాలి. యింటి చుట్టూ తోట. రకరకాల పూలమొక్కలు. కూరగాయ మొక్కలు. జొన్నచెట్లు. వచ్చేలోపు మరింత గట్టిగా వొక్కి వొక్కి పరుగు లంగించుకున్నాడు. ఇప్పుడు సూర్యం మనసు గేట్లు ఎత్తేసిన డాకులా వుంది. మనసులో పురకలేస్తోన్న జలపాతాలు.

కూలిపోని యిల్లు. ఎర్రటి మట్టితో రక్తమోడుతున్నట్టు తడిచిన గోడలు. కాస్త తడవని నేల సూర్యాని వొడిలోకి తీసుకొని జోకొట్టింది. నిద్రపోయాడు. ఆదమరిచి నిద్రపోయాడు. ఏ కలతా లేకుండా మళ్ళీ తల్లి గర్భంలో సుఖస్థానస్థలోకి జారు కున్నాడు.

విజయనగరంలో పుట్టి పెరిగిన సూర్యం చదువయిపోగానే వొక ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా చేరాడు. అందరిలా పడి వుండొచ్చుకదా! లేదు.

పిల్లలు స్వేచ్ఛగా వుండాలంటాడు. హోమ్‌వర్క్ వద్దంటాడు. అసలు పుస్తకాలు మోత వద్దంటాడు. బెత్తం పట్టనంటాడు. బాల్యాన్ని చిదిమి, సహజత్వాన్ని చిదిమి కృత్రిమత్వంలోకి, యంత్రత్వంలోకి మార్చిడి చేసే యీ మాయాజాలపు చదువులు వ్యర్థం అంటాడు. కథలంటాడు. కాకరకాయలంటాడు.

ఎవరు సహిస్తారు. చెప్పు యిన్నీ. ఆదాయానికి గండిపడే మాటలు యే వ్యాపారవేత్త వింటాడు. బయటికి గెంటేశాడు.

కాంపిటేటివ్ ఎగ్జామ్స్ రాశాడు. గ్రూప్‌ఫోర్ పాసయ్యాడు. రొట్టె విరిగి పీఠిలో పడింది. గవర్నమెంట్ మారింది. పరీక్షలు రద్దు.

గ్రూప్ టూ రాశాడు. కొండంత నమ్మకం నేల కొరిగింది. పేపర్ లీక్ అయింది.

యూనివర్సిటీ జిమ్‌లో బాగా ఎక్సర్‌సైజ్ చేసి దృఢంగా పెంచుకున్న శరీరంలో అభద్రత మొలకెత్తింది. రోజుకో అంగుళం చొప్పున కృంగిపోవటం. ఎవర్నో చంపాలనే కసి. పెనుగులాట... పెనుగులాట. నిద్దట్లో ఎవరో తన పక్కనే కదులుతున్నట్టు: మెలకువలో ఎవరో తనవే చూస్తున్నట్టు...

యిల్లు జైలులా అన్పించేంది. దూరంగా వెళ్ళి స్వేచ్ఛగా బతకాలనుకున్నాడు. కరీంనగర్‌లో వుద్యోగం – రెసిడెన్షియల్ స్కూల్ టీచర్‌గా. కొత్త వూళ్ళో స్వేచ్ఛగా వున్నట్టనిపించింది. కొత్త కుండ నీళ్ళు ఎన్నాళ్ళు చల్లగా వుంటాయి. జీవితం ఎక్కడయినా వొకటే. బతకటం అంటే తనను తాను హింసించుకోవటం.

తెల్లవారి ఐదు గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు పని గంటలు. వెట్టి చాకిరీ. కట్టు బానిసత్వం ఇంగ్లీషువాడు పోయాడు. కానీ యింగ్లీషు చదువులు మనల్ని ఏలుతున్నాయ్.

వొకసారి జ్వరం వచ్చింది. వొళ్ళు సెగలు కక్కుతోంది. నిస్సారంగా మంచంలో పడిపోయాడు. ఏ అంగానికి ఆ అంగం విడిపోయినట్టుంది. శరీరాన్ని శృతి చేసే వొక చల్లని చేయి కోసం కలవరించాడు. ఈ ప్రపంచంలో తను వొంటరి వాణ్ణని కుళ్ళి కుళ్ళి యేడ్చాడు. తాను బందీ. ఎక్కడికయినా పారిపోవాలనుకున్నాడు.

ఎక్కడికి పారిపోగలడు?

యిండ్లూ, పాఠశాలలూ, ఆఫీసులూ, కార్ఖానాలూ అన్నీ జైల్లే. అసలు ప్రపంచమే వొక పెద్ద జైలు. మరొకసారి బాగా పరిచితమైన రోడ్డులో నడుస్తూ నడుస్తూ ఆగిపోయాడు. తను ఎక్కడి నుండి వచ్చాడో ఎక్కడికి వెళ్ళాలనుకున్నాడో మర్చిపోయాడు. ఎంత గుర్తుచేసుకున్నా జ్ఞప్తికి రాలేదు. తన చుట్టూ తానే తిరిగి పడిపోయాడు.

తనకిప్పుడు అమ్మ, అక్క, తమ్ముడు, స్నేహితులూ ఏవీ గుర్తుకు రాలేదు. క్రమక్రమంగా అన్నీ మర్చిపోయాడు. చివరికి చెప్పులు వేసుకోవటం కూడా.

హఠాత్తుగా మెలకువ వచ్చింది సూర్యానికి. లేచి నిలబడ్డాడు. వాచీ చూసుకున్నాడు (చేతికి లేదు) సమయమంతా అయిపోయినట్టు గబగబా మరొక గదిలోకి వెళ్ళాడు. బొగ్గు ముక్కతో గోడమీద రాస్తూ Democracy గురించి అరగంట అనర్గళంగా పాఠం చెప్పాడు. చెప్పడం ముగించి కూలిపోయిన గోడల్ని దాటుకుంటూ రోడ్డు మీదికి వచ్చాడు.

మనుషులంతా వూళ్ళోదిగిపోయినట్టు నిర్మానుష్యంగా వుంది. సూర్యుడు కొండ దిగుతున్నాడు.

కళ్ళుమూసుకొని ధ్యానం చేసుకుంటూ వో గాడిద. దాని ముందు అటెన్షన్లో నిలబడి శెల్యూట్ చేశాడు.

గుడ...గుడ ఆకాశం వురిమింది.

తీక్షణంగా ఆకాశం కేసి చూశాడు.

వ్వెవ్వెవ్వె నెక్కిరించాడు.

మళ్ళీ వురిమింది.

వొక రాయి తీసుకొని ఆకాశం అద్దంలా బద్దలయ్యేంత కసితో విసిరాడు.

అలా వొకటి...రెండు....మూడు..ఎన్నిరాళ్లో.